www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 జనవరి 2024



మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు బదిలీ

అయ్యప్పనాయుడు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఒమ్మి అయ్యప్ప నాయుడు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ గా బదిలీ అయ్యారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్ గా నాయుడు 2020 అక్టోబర్ 7న బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇక్కడ మూడేళ్లు దాటి పనిచేసిన కారణంగా ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ అనివార్యమైంది. ఈ నెలాఖరున కమిషనర్ నాయుడు అమలాపురం నుంచి రిలీవ్ అవుతారు. నెల్లూరు జిల్లా కందుకూరు మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న ఎస్.మనోహర్ అమలాపురం కమిషనర్ గా బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకు ఫిబ్రవరి 1వతేదీన కొత్త కమిషనర్ మనోహర్ బాధ్యతలు స్వీకరిస్తారు.

రాజోలు రాజెవరో..

- జనసేనకు లైన్ క్లియర్
- వైసిపి టిక్కెట్ పై ఉత్కంఠ

ఆంధ్రప్రదేశ్ మొత్తంలో.. జనసేన గెలిచిన ఏకైక సీటు.. రాజోలు. ఇక్కడ.. జనసేన టికెట్ మీద గెలిచిన ఎమ్మెల్యే.. ఇప్పుడు వైసీపీతో ఉన్నారు. గత ఎన్నికల్లో ఎవరైతే రాపాక విజయం కోసం పని చేశారో.. ఇప్పుడు వాళ్లే.. అతన్ని ఓడిస్తామంటూ కంకణం కట్టుకున్నారు. దాంతో.. రాజోలు రాజకీయం కాక రేపుతోంది. మరి.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురుతుందా? ఏ పార్టీ తరఫున ఎవరు బరిలో నిలవబోతున్నారు? అనే ఉత్కంఠ నియోజకవర్గంలో ఉంది.

ప్రజాశక్తి-రాజోలు

కోనసీమలో సుందరమైన ప్రాంతం రాజోలు నియోజకవర్గం. సముద్రతీర ప్రాంతంగా.. అంతర్వేది శ్రీలక్ష్మినరసింహస్వామి వెలసిన ప్రాంతం. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా 15 సార్లు ఎన్నికలు జరిగాయ్. జిల్లాలో ఎస్సి రిజర్వ్‌డ్ సెగ్మెంట్‌గా ఉంది రాజోలు. అంతటి వైసిపి వేవ్‌లో.. రాజోలులో జనసేన జెండా ఎగిరింది. ఎపి మొత్తంలో జనసేన గెలిచిన ఏకైక సీటు.. రాజోలు. ఈ సెగ్మెంట్‌లో మొత్తం నాలుగు మండలాలున్నాయ్. అవి.. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు. నియోజకవర్గంలో మొత్తంగా లక్షా 86 వేల ఓట్లు ఉన్నాయ్.

2019 ఎన్నికల ఫలితాల తర్వాత.. ఎపి మొత్తం వైసిపి ప్రభంజనం గురించి ఎంత మాట్లాడుకుందో.. రాజోలులో జనసేన విజయం గురించి కూడా అంతే చర్చించింది. ఇక్కడ సిట్టింగ్ ఎంఎల్‌ఎగా ఉన్న రాపాక వరప్రసాద్.. తొలిసారి జనసేన నుంచి ఎంఎల్‌ఎగా గెలిచారు. అంతకముందు.. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచారు. 2019 ఎన్నికల్లో.. వైసిపి అభ్యర్థిపై కేవలం 814 ఓట్ల స్వల్ప మెజారిటీతో.. గట్టెక్కారు రాపాక వరప్రసాద్. అయితే.. తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో.. రాపాక అధికార వైసిపి పంచన చేరారు. అభివృద్ధి కోసం.. అధికార పార్టీతోనే ఉండాలని చెప్పి.. అధికారికంగా.. అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలుపెట్టారు. తాను గెలిచింది.. జనసేనకున్న ఇమేజ్ వల్లే.. జనసైనికుల కష్టం వల్లో కాదని.. సొంత ఇమేజ్‌తోనే గెలిచానని.. చాలాసార్లు చెప్పారు. దాంతో.. జనసేన క్యాడర్‌కు.. ఎంఎల్‌ఎకు మధ్య దూరం పెరిగింది. అక్కడి నుంచి.. వైసీపీలో బలం పెంచుకోవడంపై ఫోకస్ పెంచారు. అందులో భాగంగానే.. తన కొడుకుని వైసీపీలో చేర్చారు రాపాక. ఆయన మాత్రం వైసీపీ కండువా కప్పుకోకుండా అనధికారికంగా వైసిపిలో కొనసాగుతున్నారు.

పొత్తులో రాజోలు సీటు జనసేన

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గంలో జనసేన పోటీ చేస్తుందని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చేసిన ప్రకటన ఆ పార్టీలో జోష్ నింపింది. గతంలో జనసేన ఇక్కడి నుంచే గెలు పొందిన విషయం తెలిసిందే. టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీచేయబోతున్న నేపథ్యంలో రాజోలు సీటు నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందని పవన్ ఈ ప్రకటన చేశారు. ఇది ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఇక్కడ నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆ పార్టీ కేడర్ భావించింది. కొన్ని నెలల కిందట రెండు పార్టీల మధ్య పొత్తు పొడవడంతో అప్పటి నుంచి రాజోలు సీటుపై సందిగ్ధం నెలకొంది. ఎందుకంటే గత ఎన్నికల్లో రాష్ట్రంలోనే జనసేన నుంచి రాపాక వరప్రసాదరావు ఏకైక ఎంఎల్‌ఎగా గెలిచారు. తరువాత వైసిపిలో చేరారు. అయితే జనసేనకు సిట్టింగ్ స్థానమైన రాజోలు ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గం నుంచి తిరిగి జనసేన పోటీలో ఉంటుందని ఆ పార్టీ భావిస్తూ వస్తోంది.ప్రస్తుతం అదే నిజమైంది.

డాక్టర్ రాపాక రమేష్‌బాబు

గొల్లపల్లి సూర్యారావు

రాపాక వరప్రసాద్

దేవ వరప్రసాద్

వైసిపి ఆయనకు టిక్కెట్ ఇస్తుందా?

రాజోలు ఎంఎల్‌ఎ రాపాక.. తరచుగా ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తూ ఉంటారు. ఓ పక్క జనసైనికులతో విరోధం.. మరో వైపు పూర్తిస్థాయి వైసిపి క్యాడర్ తనతో లేకపోవడంతో.. రాపాక ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. అయితే.. రాజోలులో.. ఎస్‌సిలు, కాపుల ఓట్లు దాదాపుగా సమానంగానే ఉన్నప్పటికీ.. క్షత్రియ సామాజికవర్గం ఓట్లు డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. వాళ్లంతా.. రాపాకకు మద్దతుగానే ఉండటంతో.. ఆయనకే గెలుపు అవకాశాలున్నాయనే టాక్ వినిపిస్తోంది. అయితే.. వైసిపి ఆయనకు టిక్కెట్ ఇస్తుందా.. లేదా.. అన్నదే ఆసక్తిగా మారింది. అయితే ఇటీవల అధిష్టానం అమలాపురం ఎంపి అభ్యర్థిగా పోటీలో నిలపాలని చూస్తోంది. దీంతో రాజోలు వైసిపి నుంచి మాజీ కో ఆర్డినేటర్ మట్టా శైలజ, మలికిపురం జెడ్‌పిటిసి సభ్యుడు బళ్ల ప్రసన్నకుమారి టిక్కెట్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. సోమవారం వైసిపి అభ్యర్థుల ప్రకటన రానున్న నేపథ్యంలో వైసిపి లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

జనసేన టిక్కెట్ రేసులో ఆ ముగ్గురు..!

మరోవైపు.. గత ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన బొంతు రాజేశ్వరరావు.. ప్రస్తుతం జనసేనలో ఉన్నారు. ఈసారి చింతలమోరి సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్ బాబు నాలుగు సంవత్సరాల నుంచి పార్టీ కోసం పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించి పార్టీ మైలేజ్ పెంచారు. ఈయనకు పార్టీ క్రింద స్థాయి కార్యకర్త నుంచి నాయకుల వరకు పూర్తి మద్దతు ఉంది. దీంతో అతనికే సిటు ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో.. ఓ మాజీ ఐఎఎస్ కూడా జనసేన నుంచి టికెట్ రేసులో ఉన్నారు. ఒకవేళ.. టిడిపి పొత్తులో భాగంగా ఇక్కడన బలంగా ఉండటంతో.. జనసేన అభ్యర్థి నిర్ణయంతో గెలుపు ఓటములు ఆధారపడి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇంత వరకు బాగానే ఉన్నా అమలాపురం పార్లమెంట్ బరిలో ఎవరు ఉంటారనే అనుమానాలు జోరుగా సాగుతున్నాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో హరీష్ బాలయోగికి టిక్కెట్ ఇస్తే అమలాపురం పార్లమెంట్ స్థానానికి ఎవరు పోటీ చేస్తారని చర్చలు నడుస్తున్నాయి. ఎన్నికల సమీపించే వరకు అభ్యర్థులు ఎవరనేది బయటకు తెలియనివ్వకుండా టిడిపి అధిష్టానం జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన మోకా విద్యాసాగర్ అమలాపురం పార్లమెంట్ స్థానానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇదే కనుక నిజమైతే అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి మరో కొత్త అభ్యర్థి పరిచయమైనట్టే. అయితే ఇప్పటి వరకు అమలాపురం పార్లమెంట్ స్థానానికి హరీష్ బాలయోగి అభ్యర్థిగా భావిస్తున్న పార్టీ క్యాడర్ తాజా మార్పునకు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి. ఇక వైసిపి ఎంపి స్థానంకు రాజోలు ఎంఎల్‌ఎ రాపాక వరప్రసదరావు అభ్యంతరాలు తెలపడంతో ఎలీజా అనే కొత్త వ్యక్తిని దించాలని వైసిపి భావించినప్పటికి అతను కూడా ఎంపి టిక్కెట్‌పై ఆసక్తి చూపడంలేదు. దీంతో అమలాపురం ఎంపి స్థానంకు అధికార పార్టీ అభ్యర్థిగా ఎవరూ ఆసక్తి లేకపోవడం గమనర్హం

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

- మంత్రి పినిపే విశ్వరూప్
- అంబేద్కర్ విగ్రహావిష్కరణ, కన్వెన్షన్ భవనం ప్రారంభం
- పాల్గొన్న ఎంపీ అనురాధ, ఎంఎల్ఎ సతీష్ తదితరులు

విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి, ఎంపీ తదితరులు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

. తమ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో స్థానిక బుద్ధ పార్కు ఆవరణ లో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని మరియు సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన అంబేద్కర్ కన్వెన్షన్ భవనాన్ని శనివారం మంత్రి విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం నూతన కన్వెన్షన్ హాలు నందు నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యతో సమాజంలోని అసమానతలు తొలగిపోతాయనిరాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సూచించారని అన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శనీయమన్నారు. ఎంఎల్‌ఎ సతీష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాకు విశ్వ విజ్ఞాని అంబేద్కర్ పేరు పెట్టడం ద్వారా తన జన్మకు సార్ధకత లభించిందన్నారు. కార్యక్రమానికి ముందు బుద్ధ పార్కులోని అంబేద్కర్ విగ్రహావిష్కరణ కు విచ్చేసిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ మరియు ఎంఎల్‌ఎ సతీష్ కుమార్‌కు వందలాదిగా హాజరైన అంబేద్కరీయులు తీన్మార్, డీజే లతో పాటు బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంఎల్ సి బొమ్మి ఇజ్రాయెల్, ఎఎంసి ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు కుడిపూడి శివ శంకర రావు(ముమ్మిడివరం), నేలా కిషోర్ బాబు(కాట్రేనికోన), హితకారిణి సమాజ్ ఛైర్ పర్సన్ కాశి ముని కుమారి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిఎస్‌పి

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో డిఎస్‌పి అంబికా ప్రసాద్ పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ట్రయినీ డిఎస్‌పి విష్ణు స్వరూప్, సిఐ ఎన్.కొండయ్య, ఎస్ఐ డి.సురేష్ బాబు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్ర స్టేట్ ఫర్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ శాఖ మంత్రి ఎ.నారాయణస్వామి అమలాపురంలో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనడాని ఆదివారం రానున్నారనీ ప్రభుత్వ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఆయన ఆదివారం మధ్యాహ్నం అమలాపురం చేరుకుంటారని, సాయంత్రం అమలాపురం నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం వెళతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బి. దొడ్డవరంలో జగనన్న ఆరోగ్యసురక్ష

ప్రజాశక్తి-మామిడికుదురు

మండలంలోని బి.దొడ్డవరం గ్రామంలో లో శనివారం మండల పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు పర్య వే క్షణ లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో నగరం పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణ లత మరో ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన శివరామ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యుడు వాసంసెట్టి వెంకట రమణ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి పట్టిలింగం తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో అవార్డు అందుకుంటున్న రాము

కార్టూనిస్ట్ రాముకు జ్యూరీ అవార్డు

ప్రజాశక్తి అమలాపురం రూరల్

గుళ్లపల్లి అరుణ కుమారి స్మారక కార్టూన్ పోటీ-2024లో అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందినకార్టూనిస్ట్ మాడా రాము ప్రత్యేక జ్యూరీ అవార్డు అందుకున్నారు. ఈ బహుమతి ప్రదాన సభ విజయవాడ బాలోత్సవ భవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో పోటీ నిర్వాహకులు, వ్యంగ్య చిత్రకారులు దాస్, బాచి, హాస్యానందం మాసపత్రిక పి.రాము, సాహితీవేత్తలు డా.గుమ్మా సాంబశివరావు, జి.ఎలీషా, పాపర్తి శ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొని కార్టూనిస్ట్ రాముని అభినందించారు.

కార్టూన్



బహుమతి గెలుచుకున్న కార్టూన్

కార్టూ'నిజం'

ఆత్మగౌరవం కాపాడుకునేందుకే 'జయహో బిసి'

ప్రజాశక్తి-అంబాజీపేట

వైసిపి ప్రభుత్వంలో అవమానాలపాలైన బిసిల ఆత్మ గౌరవం కాపాడుకునేందుకు జయహో బిసి కార్యక్రమం లక్ష్యమని టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇంచార్జ్ హరీష్ బాలయోగి అన్నారు. అంబాజీపేట వాసవి కళ్యాణ మండపం ఆవరణలో శనివారం టిడిపి జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు బొంతు పెదబాబు అధ్యక్షతన జయహో బిసి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. బిసిలకు సంబంధించి 30 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి బలహీనవర్గాల అభివద్దిని నాశనం చేశారని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలలో టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించి బిసిల సత్తా ఏంటో చూపాలన్నారు. కార్యక్రమంలో పి.గన్నవరం ద్వి సభ్య కమిటీ సభ్యులు నామన రాం బాబు, వాసంశెట్టి సత్యం, మండల అధ్యక్ష కార్య దర్శులు దంతులూరి శ్రీనిరాజు, గూడాల ఫణి, జన సేన కో-ఆర్డినేటర్ మద్దా చంటిబాబు, మాచ వరం సర్పంచ్ నాగా బత్తుల శాంతకుమారి, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, ఎంబిసి రాష్ట్ర కార్యదర్శి పెండ్రా రమేష్, శెట్టిబలిజ జిల్లా అధ్యక్షుడు దాసరి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరీష్ బాలయోగి

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

ప్రజాశక్తి-మామిడికుదురు

ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టిందని పి.గన్నవరం ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం మండలం మొండిపులంకలో రూ.61.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం మరియు రైతు భరోసా కేంద్రాలను సర్పంచ్ గుడాల రామారావు తో కలిసి శనివారం ఎంఎల్‌ఎ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శరభరాజు, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

మొండెపులంకలో సచివాలయం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చిట్టిబాబు, ఎంపిపి, సర్పంచ్

తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-రాజోలు

రూ.90లక్షల సిసిఎల్‌ఎ నిధులతో నిర్మించిన రాజోలు తహశీల్దార్ కార్యాలయం నూతన భవనాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంఎల్‌ఎ రాపాక వరప్రసాదరావు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కేశవర్ధన్ రెడ్డి, తహశీల్దార్ ఎం.ముక్తేశ్వర రావు, జెడ్‌పిటిసి సభ్యుడు మట్టా శైలజ, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, కంచర్ల శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంగమేశ్వరకాలనీలోని ఎంపిపి పాఠశాల్లోని విద్యార్థులకు జిపిఆర్, జిఎస్ఎన్ఆర్ సమకూర్చిన ఉపకార వేతనాలను కౌన్సిలర్ మారిసెట్టి సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థి చదువుకు ఆసరాగా ఉంటుందని ఉద్దేశ్యంతోనే ఆ ప్రతి విద్యార్థికి రూ.3 వేలు చొప్పున ఉపకరణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యాంబ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

పట్టణ పరిధిలో దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు దోమల నివారణకు శనివారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.లావణ్య మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒకటవ వార్డు నుంచి 30 వార్డులలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నామన్నారు. తొలుత సత్య శ్రీ రోడ్, గాంధీనగర్, రాజీవ్ గహకల్ప తదితర ఏరియాలతో పాటు మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ మరో మూడు రోజుల్లో పాగింగ్ చేస్తామన్నారు. పట్టణ ప్రజలు దోమల నివారణలో భాగంగా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మురుగునీరు వెళ్లేందుకు ఆటంకం లేకుండా డ్రెయిన్లలో చెత్త వెయ్యకుండా ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలన్నారు.

మత్స్యకార కాలనీలో శానిటేషన్

అమలాపురం (అల్లవరం) అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలో గల మత్స్యకార కాలనీలో గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గు, బ్లీచింగ్‌లో ప్రత్యేక శానిటేషన్ ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దుర్గా శ్రీను, పాలకవర్గ సభ్యులు కారాడి నాగలక్ష్మి, బస్వాని హేమలవతి, ఎంపిటిసి సభ్యురాలు బస్వాని పద్మ, విలేజి హెల్త్ ఆఫీసర్ రాపాకు సౌమ్య, ఎఎన్ఎం అమరావతి, బ్రహ్మానందం, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాల అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉత్తమ సేవలు అందించిన వారికి, సంస్థలకు ఈ నెల 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో పురస్కారాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ అందజేశారు.

అమలాపురం జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీ నారాయణ, జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల కార్యాలయంలో టైపిస్ట్ గా పని చేస్తున్న కె .భారతి కూడా ఉత్తమ సేవా పురస్కారాలు ఈ సందర్భంగా అవార్డు పొందిన ఇద్దరినీ పలువురు అధికారులు అభినందించారు. జిల్లా ఎస్‌పి ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఎస్.జగదీశ్వర్ ప్రసాద్ ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రజా ప్రతినిధులు,అధికారులు అభినందించారు. **ఐ.పోలవరం** జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి ఉత్తమసేవా పురస్కారాలు లభించాయి. ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ట్రెజరర్ ముదునూరి సతీష్ రాజు, ఒలుగుల బాలరాజు, రెల్లి సుజాత ప్రశంసా పత్రములు అందుకున్నారు. **రామచంద్రపురం** మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కమిషనర్‌ను మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు అభినందించారు.**కొత్తపేట** అవిడి ఫీల్డ్ అసిస్టెంట్ చుట్టూరి వెంకటేష్ అనే రాజు కు జిల్లా లో అవిడి గ్రామంలో అత్యధిక పని దినాలుఉపాధి హామీ కూలీలకు పని కల్పించడం ద్వారా జిల్లా ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ సేవ పురస్కారం అందుకున్నారు.



సేవాపురస్కారం స్వీకరిస్తున్న రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి.

సేవా పురస్కారం అందుకుంటున్న డిఐపిఆర్‌ఒ లక్ష్మీనారాయణ

అవార్డు స్వీకరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్ ప్రసాద్

పురస్కారం అందుకుంటున్న 'రెడ్ క్రాస్ సొసైటీ'

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఈ ఏడాది జరిగిన గణతంత్ర వేడుకల్లో అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా శనివారం వారిని పలువురు అభినందించారు.

మండపేటలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం

అమలాపురం రూరల్ అమలాపురం మండలం కామనగరువు పంచాయతీ సర్పంచ్ నక్క అరుణకుమారికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో ఉత్తమ సేవ పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్లా చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కామనగరువులోని ఆమె స్వగృహంలో ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కర రావు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రాజా, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు కలిసి అభినందనలు తెలియజేశారు. **మండపేట** ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న మండల అభివృద్ధి అధికారి ఐదంరాజు, మండల పరిపాలన అధికారి వి ఎన్. ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ఎస్‌వి వి.గోపాల్ లను మండపేట నియోజకవర్గం వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సత్కరించింది. పలువురు మాట్లాడుతూ ఒకే కార్యాలయం నుంచి ముగ్గురు అధికారులు అవార్డులందుకోవడం ఆనందంగా ఉందన్నారు. సేవలను గుర్తించిన ప్రభుత్వం అవార్డులు అందించడం సంతోషకరమన్నారు. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ శాంతి, రిటైర్డ్ హెచ్ఎం గెడా శ్రీనివాస్, ఎన్..అప్పారెడ్డి, ఎస్.వీర్రాజు, సత్యనారాయణ, సిహెచ్.కృపారావు, పాఠశాల హెచ్.ఎం.ఆర్.నాగకుమార్, కోఆర్డినేటర్స్ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** గ్రామపంచాయతీ కార్యదర్శి కర్రీ సంజీవరెడ్డి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు సంజీవరెడ్డిని శనివారం వైసిపి గ్రామ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రామపంచాయతీ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఆలమూరు కార్యదర్శి సంజీవరెడ్డికి ఘన సత్కారం



అమలాపురం మండలం కామనగరువు సర్పంచ్ అరుణకుమారికి పలువురి అభినందనలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రోళ్లపాలెం నేషనల్ హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. గారపాటి వెంకట్రావు, గారపాటి మంగతాయారు భార్యాభర్తలు. వారు శనివారం అమలాపురం వైపు నుంచి బోడసకుర్రు వైపునకు బైకుపై వెళ్తున్నారు. వారు రోళ్లపాలెం వద్దకు వచ్చే సరికి ఎదురుగా మినీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట్రావు(55), మంగతాయారు(50) అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని అమలాపురం పట్టణ ఎస్ఐ క్రిస్టోఫర్, రూరల్ ఎస్ఐ వీరబాబు, అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్ పరిశీలించారు. ఘటనకు కారణమైన వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారని డిఎస్‌పి అంబికా ప్రసాద్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ నుంచి తిరుమలకు వెళుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ జారిపడిన సంఘటనలో వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానిక రైల్వేస్టేషన్లో శనివారం రైలు కదిలే సమయంలో ఎక్కుతూ ఒక్కసారిగా జారిపడి కిందపడిపోయాడు. దీంతో ఆ ప్రయాణికుడికి గాయాలయ్యాయి. దీంతో రైల్వే పోలీసులు ఆ క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలపాలైన వ్యక్తి వివరాలు తెలియాల్సివుంది.

సారా కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు, బొర్రంపాలెం గ్రామాల శివారుల్లో ఉన్న సారా బట్టీలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా బట్టీ నిర్వాహకులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ లక్ష్మణరావు వెల్లడించారు. తాళ్లూరు గ్రామ శివారులో సారా బట్టీపై దాడి అయినవిల్లి సత్యనారాయణను అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే బొర్రంపాలెం గ్రామానికి చెందిన పిడిమి దుర్గా ప్రసాద్ తాళ్లూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామిని దర్శించుకునేందుకు నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కుని పరారయ్యారు. పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన మహిళ కాలినడకన తన గ్రామం నుంచి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి బయలుదేరి వస్తుండగా దివిలి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో బంగారు గొలుసు, పుస్తెల తాడు తెంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ మహిళ కేకలతో చుట్టుపక్కల వారు రావడంతో అప్పటికే తగిపోయిన బంగారు గొలుసు తీసుకుని పారిపోయారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పోలీస్ స్టేషన్లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు.

కారును ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ రోడ్‌లో రైల్వేగేటు సమీపంలో శనివారం సాయంత్రం ఆదిత్య కళాశాలకు చెందిన బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారు గోదావరి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలావున్నాయి..శనివారం సాయంత్రం పెద్దాపురంలో విధులు ముగించుకుని మారుతి కారులో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్ కాకినాడ బయలుదేరారు. స్థానిక రైల్వే గేట్ దాటాక వెనక నుంచి ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు కుడివైపు ఉన్న గోదావరి కాలంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డిఇ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు కాలువలో పడిన కారును క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ రాకపోకలను క్రమ బద్ధీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీకొన్న కారు

ప్రజాశక్తి - యానాం

దొమ్మేటి పేట సమీపంలో కొండమూరి భాస్కరరావు గార్డెన్ వద్ద అదుపుతప్పి ఒక కారు చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలావున్నాయి. యానాంకు చెందిన డిపర్తి నారాయణస్వామి, పూడి కిరణ్ ఇద్దరూ యానాం నుంచి పొలానికి వెళ్తుండగా శనివారం భాస్కరరావు గార్డెన్ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి రెండు పల్టీలు కొట్టింది. అయితే కారులో ఉన్న ఇద్దరు తేరుకుని బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే డీజిల్ ట్యాంకుకు రంధ్రం పడి కారులోంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఇద్దరికి స్వల్ప గాయాలపాలయ్యారు. కారుడ నుంచి బయటపడిన తరువాత ఒక వ్యక్తి స్పృహ కోల్పోవడంతో ఇద్దరిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు ధృవీకరించారు. ఈ ప్రమాదంపై ట్రాఫిక్ ఎస్ఐ వీరభద్రస్వామి కేసు నమోదు చేశారు.

'మరివాడ' నేత్రదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం



మరివాడ సర్వేశ్వరరావు (ఫైల్)

కె.గంగవరం మండలంలోని పామర్రు గ్రామంలో మరివాడ సర్వేశ్వరరావు(73) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ మేరకు శనివారం కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు సిబ్బంది సర్వేశ్వరరావు మృతుడు సర్వేశ్వరరావు కార్నియాలను సేకరించారు. ఇప్పటివరకు ఈ గ్రామంలో 9మంది నేత్రదానం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా మతునికి ముగ్గురు కుమారులు ఉన్నట్లు బంధువులు తెలిపారు. డాక్టర్ దానం చేసినందుకు వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

స్ఫూర్తినీయం...అంగన్‌వాడీల పోరాటం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీ ఉద్యోగులు తమ ఉద్యమ పథంలో మరో మైలురాయిని దాటారు. అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చిన విషయం విధితమే. విజయవాడకు బయలు దేరిన అంగన్‌వాడీలను ప్రభుత్వం నిర్బంధానికి గురి చేసింది. జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లల్లో అక్రమ అరెస్టులకు పాల్పడి సుమారు 12 గంటల పాటు నిర్బంధించింది. అక్కడితో ఆగకుండా టెర్మినేషన్ లెటర్లు తీసుకోవాలంటూ బెదిరింపులకు సైతం పాల్పడింది. అయినా అంగన్‌వాడీలు వెనక్కి తగ్గలేదు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామంటూ తేల్చి చెప్పి భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిగా నిలిచారు. ఎట్టకేలకు ప్రభుత్వమే దిగొచ్చి పలు డిమాండ్లను పరిష్కరించడంతో పాటు వేతనాల పెంపునకు గడువు కోరింది. నిర్దేశిత కాలంలోపు హామీలు అమలు చేయని పక్షంలో మరోసారి సమ్మె తప్పదంటూ అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఇది తాత్కాలిక విరామమే అంటూ తేల్చి చెప్పారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు యథావిధిగా విధుల్లో చేరి సేవలందిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు సిపిఎస్ రద్దు కోరుతూ మరో పోరాటానికి సిద్ధం అయ్యాయి. గతంలో నిర్వహించిన ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. ఇప్పుడు మరో రాష్ట్ర వ్యాప్త పోరాటానికి సిద్ధపడ్డారు. దీనికి రాజమహేంద్రవరం వేదిక కానుంది. నేడు జరిగే సభలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించేందుకు అవి సమాయత్తం అయ్యాయి. ప్రభుత్వం పునరాలోచించుకుని పాత పెన్షన్ స్కీమును అమల్లోకి తీసుకురాకుంటే తీసుకోవాల్సిన కార్యాచరణకు నేడు బీజం పడనుంది.

టిడిపి, జనసేన కూటమిలో ముసలం

టిడిపి, జనసేన కూటమిలో ముసలం పుట్టింది. మూడు నెలల క్రితం ఇదే జిల్లాలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పొత్తు ప్రకటించిన విషయం విధితమే. అయితే తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ పొత్తుకు జిల్లాలోనే తెరపడనుందా అనే సందేహాలు ఆ రెండుపార్టీల్లోనూ వ్యక్తమవుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబు అరకు, మండపేట నియోజక వర్గాల నుంచి టిడిపి పోటీ అంటూ చేసిన ప్రకటనపై జనసేన అధినేత భగ్గు మన్నారు. తామేమి తక్కువ కాదంటూ రాజానగరం, రాజోలులో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. చంద్రబాబు పొత్తు ధర్మం పాటించలేదని ఘాటుగా విమర్శించారు. ఈ నేపథ్యంలో రాజానగరంలో తెలుగు తమ్ముళ్ల తిరుగుబావుటా ఎగురవేశారు. జనసేనకు సహకరించేది లేదని పత్రికా ముఖంగా తేల్చిచెప్పడంతో పాటు పార్టీ అధ్యక్షులకు వినతిపత్రం అందించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని 2014 ఫలితాలు, 2024లో పునరావృతం కావడం ఖాయమని తేదేపా నేతల్లో ధీమా వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలతో పొత్తుపై నీలినీడలు కమ్మాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

'తూర్పు'పై స్పెషల్ ఫోకస్

టిడిపి నేతలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్పెషల్ ఫోకస్ పెట్టారని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. అధినేత చంద్రబాబు నాయుడు మండపేటలో నిర్వహించిన సభలో ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని కోరడంతో పాటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు ఎంపీ సీటు గెలవటం ఖాయమని జోస్యం చెప్పారు. అయారాం. ఇదే సందర్భంగా మండపేట ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలంటూ అభ్యర్థిని ఖరారు చేసినట్లు చెప్పకనే చెప్పారు. తూర్పులో తొలి

సీటు ఖాయం అవడంతో వేగుళ్ల శిబిరంలో నూతనోత్సాహం నెలకొంది. ఇదే సభలో అధికార పార్టీ నేతలకు పేరు పేరునా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశమైంది. మరోవైపు చంద్రబాబు సతీమణి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు పర్యటించి పార్టీ శ్రేణులతో మమేకం అయ్యారు. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో నిజం గెలవాలి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. మనోవేదనతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేదుకు మూడు జిల్లాల్లో పలు కుటుంబాలను కలిశారు. పార్టీ శ్రేణులతో మమేకమై జిల్లా తేదేపాలో ఉత్సాహాన్ని నింపారని తెలుస్తోంది.

ఓటర్ల జాబితాపై వెల్లువెత్తిన విమర్శలు

జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసిన ఓటర్ల జాబితా తప్పుల తడకలుగా మారటంతో ఓటర్లలో అసహనం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16.50 ల క్షల ఓటర్లు ఉన్నారని అధికార యంత్రాంగం లెక్కతేల్చింది. ఆ మేరకు గత వారంలో జాబితాను విడుదల చేసింది. తాజా జాబితాలో తప్పులను వీలైనంత త్వరగా సరిచేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఈ-పంట నమోదు వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

సమస్యలు తెలుసుకుంటున్న బోసుబాబు

బెండమూరులంక గ్రామంలో ఇ-పంట నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు శనివారం పరిశీలించారు. ఇ పంట నమోదు జరిగిన రికార్డులను సూపర్ చెక్ రూపంలో రైతుల పేర్లు, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం,పంటపేరు, పంట రకం, నాటిన తేదీ మొదలగు వివరాలు తనిఖీచెయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ అల్లవరం మండలంలో ఇప్పటి వరకు 1600 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అవ్వగా 1300 ఎకరాల్లో ఈ పంట పూర్తి అయిందని అన్నారు. ఈ పంట నమోదు ప్రక్రియను ఫిబ్రవరి 15వ తేదీ లోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. వరినాట్లు త్వరగా పూర్తిచెయ్యలని రైతులకు సూచించారు. నీటి ఎద్దడి వస్తే తమ దృష్టికి తీసుకొని వస్తే నీటిపారుదల శాఖ వారికి తెలియచేస్తామని రైతులకు సూచించారు. తదుపరి కోడూరుపాడు గ్రామంలో ఇ పంటను నమోదు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్‌వివి.సత్యనారాయణ, వైస్ ఎంపిపి ముత్యాల రామకృష్ణ, బెండముర్లంక సర్పంచ్ బర్రె సీతారత్నం, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జె.విజయ లక్ష్మి, విఆర్ఒ మెట్ల బాబ్జి, రైతులు గుర్రం నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.2.08 లక్షలు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయనికి శనివారం దర్శనం, టిక్కెట్‌లు, లడ్డు విక్రయాల ద్వారా రూ.1,60,615, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.47,833, మొత్తం రూ.2,08,448 ఆదాయం సమకూరిందని సహాయకమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. 3,571మంది భక్తులు దర్శనం చేసుకోగా, 2,695 మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన 'వెంకటరమణ'

ప్రజాశక్తి-రామచంద్రపురం

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడ్ని రామచంద్రాపురం టిడిపి నాయకుడు డాక్టర్ కాద వెంకటరమణ మర్యాదపూర్వకంగా మంగళగిరి లోని పార్టీ కార్యాలయంలో కలిసారు. తనకు రామచంద్రాపురం శాసనసభ సీటును కేటాయించాలని ఆయన అభ్యర్థనను అందజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రామచంద్రాపురం నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు అన్ని స్థాయిల్లో నాయకులతో కలిసి సమన్వయంతో కృషిచేయాలన్నారు. మండపేటలో జరిగిన రా కదలిరా కార్యక్రమంలో భాగంగా వెంకటరమణ పార్టీ లో చేరిన విషయం విధితమే. కాకినాడలోని సత్య స్కాన్ అధినేతగా సుపరిచితులు వెంకటరమణ

జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసి పరిపాలనా రంగాల్లో విప్లవాత్మక మార్పులు సిఎం జగన్ తీసుకువచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గొల్లవిల్లిలో శనివారం వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన మండల పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మంత్రి విశ్వరూప్ పాల్గొని పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న సిఎం జగన్‌ను తప్పకుండా రాష్ట్ర ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, వైఎస్ ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, సర్పంచ్ లు పెయ్యల రాజ్ కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'మద్దింశెట్టి' కుటుంబానికి పరామర్శ

ఉప్పలగుప్తం గొల్లవిల్లికి చెందిన మద్దింశెట్టి వీర్రాజు ఇటీవల మతిచెందారు. మృతుని కుటుంబాన్ని మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. వీర్రాజు చిత్రపటానికి మంత్రి విశ్వరూప్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బడుగు గణేష్, సలాది శివాజీ,సచివాలయ కన్వీనర్ పోలిశెట్టి వీరబాబు, నాయకులు ఉన్నారు.

పథకాలను పునరుద్ధరించాలని బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-మామిడికుదురు

నవ దుర్గా ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ శనివారం రాజోలు నుంచి మామిడికుదురు వరకు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలు పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని మామిడికుదురు రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బత్తుల జనార్ధన్, మెడబల రామారావు, చిట్టూరి శ్రీనివాసరావు, పాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

కార్మిక నాయకుడు మురళీమోహన్‌కు నివాళి

ప్రజాశక్తి - యానాం

యానాం రీజెన్సీ సెరామిక్స్ ఫ్యాక్టరీ కార్మిక ఉద్యమ నాయకుడు మచ్చ మురళీమోహన్ 12వ వర్ధంతిని కార్మికులు శనివారం నిర్వహించారు. రీజెన్సీ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద మురళీమోహన్ సతీమణి దుర్గ చేతుల మీదుగా ఎర్ర జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రీజెన్సీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ విల్సన్, జాయింట్ సెక్రెటరీ అడబాల సాంబశివరావు, గుదే దుర్గాప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రీజెన్సీని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. మురళీమోహన్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మురళి,రామేశ్వరరావు, వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు రీజెన్సీ ప్రతినిధుల నివాళి

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ సెరామిక్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ దివంగత కెసి.చంద్రశేఖర్‌కు రీజెన్సీ గ్రూప్ సంస్థల ప్రతినిధులు నివాళులర్పించారు. రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో చంద్రశేఖర్ 12వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర్ చిత్రపటానికి రీజెన్సీ సిరామిక్స్ సిఇఒ కె.మోహన్‌రావు, పూర్వపు రీజెన్సీ ఉద్యోగి కాకరపర్తి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం టివిఎస్-ఎస్‌వి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆయన ఎందరికో ఆదర్శనీయమని, దానధర్మాలు చేసేవాడని తెలిపారు. అనంతరం యానాం వృద్ధాశ్రమంలో ఉన్న చంద్రశేఖర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎస్ఐ జోషికి అభినందనలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కెఎం.జోషిని శనివారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఎస్ఐను వారిలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఎంపిటిసి ల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, మాజీ సర్పంచ్ తొత్తరమూడి నరసింహారావు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ సొసైటీ అధ్యక్షులు ఊటాల రామాంజనేయులు, నాయకులు కాట్రు కృష్ణ, బీర బాలరాజు తదితరులు ఉన్నారు.

టిడిపి భవిష్యత్తు గ్యారంటీ పత్రాల అందజేత

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేటలో పత్రాలు అందిస్తున్న టిడిపి నాయకులు

అంబాజీపేటలో శనివారం ఇంటింటికీ భవిష్యత్తు గ్యారంటీ పత్రాలను టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ గణపతి వీర రాఘవులు, అందజేశారు. అనం తరం వారి సమ స్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు తెలియ జేసి టిడిపి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తుతోపాటు ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే అసమర్థ వైసిపి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బొంతు పెదబాబు, ఎస్‌సి సెల్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, జిల్లా బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి దొమ్మేటి శ్యామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో 'బాబు ష్యూరిటీ'

మండపేట మండలంలోని కేశవరం గ్రామంలో 3వ రోజు 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో శనివారం జరిగింది. ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయన్నారు. రాష్ట్రం అభివద్ధి చెందాలంటే టిడిపి జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

3న'చలో ఢిల్లీ'కి పిడిఎస్‌యు పిలుపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఫిబ్రవరి 3న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని పిడిఎస్ యు విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. శనివార పిడిఎస్‌యు నాయకులు బి.సిద్ధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ సమాన ప్రమాణాలు గల విద్య కొరకు, సామాజిక న్యాయం అమలు చేయాలని తెలియజేశారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం పిడిఎస్‌యు నాయకులు అభిషేక్, బాలాజీ, సూర్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

సాయం అందజేస్తున్న 'మనం ట్రస్ట్'

కొత్తపేట శివారు చినరాముడు నూతి మెరక లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో యనమదల కృష్ణ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబానికి మనం ట్రస్ట్ ఇన్చార్జి వై.పవన్ అధ్వర్యంలో దాతల సహకారంతో నిత్యావసరాలు, కూరగాయలు, చీరలు, దుప్పట్లు, టవల్స్ మరియు రూ.8 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మళ్ళ రాజు, పి.కృష్ణారావు, చొప్పెర్ల రాజా, బ్యాంకర్స్ తిరుమల కట్ పీసెస్ సాయి కృష్ణ, సిద్ధంశెట్టి శ్రీను పాల్గొన్నారురు. బాధిత కుటుంబాన్ని బండారు శ్రీనివాస్ పరామర్శించారు. జనసేన పార్టీ తరుపున 10వేలు రూపాయలు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో బి. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట



పరామర్శిస్తున్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల

పట్టణంలో ఇటీవలె మరణించిన పలు కుటుంబాల సభ్యులను ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం పరామర్శించారు. కుమారపు సుబ్బాయమ్మ, రాయుడు రాముడు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పిట్టా రాజుబాబు, బడుగు రత్నం రాజు, తదితర్లు ఉన్నారు .**రామచంద్రపురం** టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రెడ్డి సుబ్రమణ్యం శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో చిట్టూరి వెంకట్ రాయుడు ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను, అదేవిధంగా సత్యవాడ గ్రామంలో సలాది బుల్లబ్బులు కుటుంబ సభ్యులను, మండల యువత అధ్యక్షులు సలాది సత్తిబాబు పెదనాన్న మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బ్రహ్మపురి లో టిడిపి నాయకులు బాలదాసు తల్లి ఇటీవల మృతి చెందింది. వారి కుటుంబీకులను సుబ్రహ్మణం పరామర్శించారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలపై పర్యవేక్షణ కరువు

ఎపి విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-రాజోలు

పొన్నమండ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

ప్రభుత్వ విద్యాసంస్థలపై పర్యవేక్షణ కరువువైందని ఎపి విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన రాజోలు మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒక ప్రాథమిక, మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో తనిఖీలు చేశారు. తాటిపాక హైస్కూల్లో గత ఐదు నెలలుగా ఐఎఫ్ పి బోర్డు (స్మార్ట్ టి పనిచేయక పోవడంతో హెచ్ఎం హరినాథ్‌పై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నమండ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయడం లేదని అన్నారు. పొన్నమండ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు వినియోగిచడం కూడా రాకపోవడంతో విద్యార్థులకు మీరు ఏమి బోధిస్తున్నారని ఉపాధ్యాయులపై తీరుపై మండిపడ్డారు. రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో ఎఫ్.1, ఎఫ్.2 పరీక్షాపత్రాలను పరిశీలించారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించి విద్యార్థులను రేకు షెడ్లో కూర్చోబట్టడం పై కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ కేవలం పర్యవేక్షణ లోపం వల్లే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో వెనుక బడ్డారని అన్నారు. జిల్లా స్థాయిలో ఆర్‌జెడి, డిఇఒ, మండల స్థాయిలో ఎంఇఒలు, పాఠశాలల్లో హెచ్ఎంల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోందని అన్నారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్‌డిఒ విష్ణు కేశవర్ధన్ రెడ్డి, ఆర్‌జెడి జి.నాగమణి, డిఇఒ ఎం.కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి పథం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

శిబిరం వద్ద మాట్లాడుతున్న ఆర్‌సిపిఐ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగమణి

అమలాపురం కలెక్టరేట్ వద్ద వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని ఆర్‌సిపిఐ నాయకులు శనివారం సందర్శించారు. డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం ఉద్యోగులకు ఆర్‌సిపిఐ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.నాగమణి ఆధ్వర్యంలో తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ సెర్ప్ సిబ్బంది పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరంలకు పెంచాలని అన్నారు. తెలంగాణ సెర్ప్ ఉద్యోగులకు ఇచ్చే పే స్కేల్ ను వీరికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించే వరకు తమ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సహాయ కార్యదర్శి కొట్టాల వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు కె.వీరబాబు, దుర్గాప్రసాద్, టి సురేంద్ర, పి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం** డిఆర్‌డిఎ సెర్ప్ ఉద్యోగులుఅమలాపురం గడియార స్తంభం వద్ద మానవహారం చేపట్టారు. మల్కిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి, మండలాల వివొఎలు మద్దతు తెలిరు.ఈ కార్యక్రమంలో జిల్లా జెఎసి అధ్యక్షులు డి. వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, ర్యాలి అర్జున్, .ముత్యాల రమేష్, భూపతి వర్మ ,పి. రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 512 ను రద్దు చేయాలని వినతి

అమలాపురం రూరల్ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 512 ను రద్దు చేయాలని కోరుతూ ఆర్‌సిపిఐ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.నాగమణి ఆధ్వర్యంలో శనివారం తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్‌సిపిఐ ఆధ్వర్యంలో జిల్లాలో గత వారం రోజులుగా ఈ మేరకు సంతకాల సేకరణ జరుగుతుందన్నారు. భూమి యాజమాన్య హక్కు చట్టాన్ని అమలు చేయడం వల్ల భూకబ్జాలకు దారితీసే అవకాశం ఉందని, పేద మధ్యతరగతి రైతులకు భూవివాదాల్లో న్యాయం అందని ద్రాక్షగా మారునుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొట్టాల వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు కె.వీరబాబు, దుర్గాప్రసాద్, టి సురేంద్ర, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీ రాయుడు వెంకటరమణ తండ్రి:రాయుడు శ్రీరాములు** గార్కి బి.దొడ్డవరం గ్రామంలో గల **డాక్యుమెంట్ నెంబర్ 76/2024** దానపట్టా దస్తావేజు పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజినల్స్ రిజిస్టర్ దస్తావేజు నెంబర్ **76/2024 (తేది.09-01-2024)** ఈ రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్‌కు లింకు డాక్యుమెంట్‌గా ఉన్న **1030/1998 (తేది.12-11-1998)**ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం బి.దొడ్డవరం ఇంటి దగ్గర నుండి అమలాపురం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా దానపట్టా దస్తావేజు **76/2024 (తేది: 09-01-2024)** దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ దానపట్టా దస్తావేజు **1030/1998** యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్స్ సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపోజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైన వీటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎన్.రమేష్, అడ్వకేట్ & నోటరీ
అమలాపురం. సెల్: 8008027999

వేలం ప్రకటన

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 104/2013, O.S. 150/2010

Between:
Peddireddy Ramam ...D.H.R
AND
Illa Satyavathi and Othrs ...J.D.R's

యీ నెంబరు E.P.లో DHR, JDRsకి చెందిన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలమునకు తీసుకొని వచ్చుచున్నాడు. సదరు వేలంలో పాల్గొని పాట పాడుకోదలచినవారు **ది.06-02-2024 ఉదయం 10:30 గంIIలకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి పై **వేలంలో పాల్గొని షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంలో పాట పాడుకోవచ్చును.** మిగతా వివరాలు కోసం శ్రీ కోర్టు వారి నజారత్ ఆఫీసు నందు అడిగి తెలుసుకొనవలెను.

వేలం తేది: 06-02-2024

SCHEDULE

East Godavari District, Amalapuram Sub-Registry, Amalapuram Mandal, Peruru Village, Chindadagaruvu Panchayat Zeroyiti Wet.

Item No-1: R.S. No. 526/1, Ac. 2-30 cents out of full Ac. 2-66 cents

Boundaries: EAST: Irrigation bodi. ***SOUTH:*** Land of Pappula Udaya Bhaskaram. ***WEST:*** Land of Kode Naga Sundaram and others. ***NORTH:*** Land of Mushini Krishna Rao.

***Item No-2:* R.S. No. 526/1 Ac. 0-36 cents of Coconut garden out of full Ac. 2-66 cents.**

Boundaries: EAST: Item No. 1. ***SOUTH:*** Land of Pappula Udaya Bhaskara Rao. ***WEST:*** Drainage Canal. ***NORTH:*** Land of Mushini Krishna Rao.

Item No-3: R.S. No. 526/4 Ac. 0.34 cents out of full Ac. 0-90 cents.

Boundaries: EAST: Irrigation Bodi. ***SOUTH:*** Item No. 1. ***WEST:*** Land of Nagabheri People. ***NORTH:*** Land belongs. to Konde Naga Sundaram and Others. Total Ac. 3-00 of land with all fruit bearing trees and all other easementary rights etc.,

D.H.R. Value: Rs. 4,00,000/-
J.D.R. Value: NIL
Amin Value: Rs. 1,20,00,000/-
SRO Market Value:
Wet land Rs. 26,00,000/- per Ac.
Dry land Rs. 23,00,000/- per Ac.

G.S.NAIDU, Advocate
Amalapuram, Amalapuram
25-01-2024. Cell: 94409 25462